## వెంకన్నకు బంగారు కంఠభరాణం బహుకరణ



తిరుమల, డిసెంబర్ 18 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల ధర్మగిరి వేదపాఠశాలలో శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం ఆదివారం మహాపూర్ణాహుతితో విజయవంతంగా ముగిసింది. అనంతరం శ్రీవారి ఆలయంలోనికి చేరుకున్న టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు. ఆలయంలోపల సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతరెడ్డి తయారుచేయించిన 2.12గ్రాముల బంగారు కంఠభరాణాన్ని డిప్యూటీ ఇఓ రమేష్‌బాబుకు అందజేశారు. ఈ కంఠాభరణాన్ని శ్రీదేవి సమేతబంగారు కంఠాభరణాన్ని స్వామివారికి సమర్పించారు.





# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## నో వీక్లీ ఆఫ్‌లు విశ్రాంతి లేని పోలీసులు!!

**అమలు కాని సిఎం ఆదేశాలు**



ప్రభాతవార్త-తిరుపతి: తిరుపతి జిల్లా పోలీసులు వీక్లీ ఆఫ్‌లకు దూరంగా...నిర్ణీత డ్యూటీల కంటే అదనపు డ్యూటీల భారంతో విశ్రాంతి కరువై ,ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీకి నోచుకోలేకపోతున్నామనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా తిరుపతి నగరంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్, నేర విభాగంలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది అదనపు డ్యూటీలతో సతమతమవుతున్నా మనే అంతర్మధనం చెందుతున్నారు. ఇక తిరుమల, రేణిగుంట, శ్రీకాళహస్తి సబ్‌డివిజన్‌ల పరిధిలోని పోలీసులు విశ్రాంతి లేకుండా డ్యూటీలు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోందనే మధనపడుతున్నారు. పోలీసుశాఖ క్రమశిక్షణకు మారుపేరు కావడంతో కడుపుచించుకుంటే కాళ్ళపై పడిందనే రీతిలో తమ కష్టాలు మౌనంగా భరించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ప్రజల మాన,ధన, ఆస్తులపరిరక్షణతో బాటు ప్రముఖుల భద్రతలో కుటుంబాలకు దూరమై విధులు నిర్వహించాల్సి వస్తోంది. పోలీసుస్టేషన్‌లలో క్రిందిస్థాయి పోలీసుకానిస్టేబుల్ నుంచి సిఐలు, డిఎస్పీ హోదా అధికారుల వరకు స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పి ఇష్టంతో విధులు నిర్వహించుకునేలా చూడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉన్నతాధికారులు చెప్పినా అమలుకావడం లేదనే బాధ వెలిబుస్తున్నారు. గతకొంతకాలంగా తిరుపతి జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్‌లలో రెండు సెక్షన్లు అమలవుతుండటంతో విశ్రాంతి కరువైందనే ఆవేదన చెందుతున్నారు. అడపాదడపా తిరుపతి వంటి నగరాల్లో ప్రముఖుల పర్యటనల సమయాల్లో అదనపు డ్యూటీల భారం మరీ ఇబ్బందిగా మారిందని పెదవివిరుస్తున్నారు.పోలీసు సిబ్బంది సంక్షేమంపై దృష్టిపెట్టామని పదేపదే చెబుతున్న ఉన్నతాధికారులు పలు కారణాలతో రెండు షిఫ్టులు అమలుచేయించడంతో కుటుంబంతో గడిపే సమయం కరువైందని, కనీసం పిల్లల చదవులు, వారి బాగోగులు చూసుకునే పరిస్థితి కూడాలేకపోయిందనే అంటున్నారు. గతంలో నాలుగు సెక్షన్లు అమలయ్యే రోజుల్లో కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐల వరకు కొంతవరకు కాస్త విశ్రాంతి, ఆఫ్ వుండేదని పేర్కొంటున్నారు. ఇప్పుడు ఏకంగా రెండు సెక్షన్‌లతో డ్యూటీ దిగి ఇంటికి చేరుకుని తిరిగి పోలీసుస్టేషన్‌లకు డ్యూటీకి రావడానికి సమయం సరిపోతోందని మధనపడుతున్నారు. మరీ మహిళ పోలీసుల పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని, ఉదయం 7గంటలకు షిఫ్ట్ స్టేషన్‌కు రావడానికి ముందుగానే పిల్లలకు అవసరమైనవన్నీ సిద్ధంచేసి రావాలంటే సతమతమవుతున్నా రనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రాత్రి సెక్షన్‌కు చేరుకోవడానికి కొంత ఆలస్యమైనా సెక్షన్ ఇన్‌ఛార్జిలు, పై అధికారుల నుంచి మాటపడుతున్నారనేది లేకపోలేదు. తిరుపతి జిల్లా ఏర్పాటైన తరువాత జిల్లా వ్యాప్తంగా రెండుషిఫ్టులతోనే అదనపు భారంగా మారిందని పోలీసుల ఆవేదన. జిల్లావ్యాప్తంగా సుమారు 2,500మందిపైగా పోలీసు సిబ్బంది ఉన్నారు. వీరుగాక ఎస్‌ఐలు, సిఐలు, డిఎస్పీ అధికారులు ఆపై ఉన్నారు. సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండటంతో అదనపు డ్యూటీల భారం ఉందని పోలీసు వర్గాల సమాచారం. ఇప్పుడు విశ్రాంతి లేని డ్యూటీలతో పోలీసులకు వీక్లీ ఆఫ్‌లు అమలయ్యేలా పోలీసు అధికారుల సంక్షేమ సంఘం నాయకులు చూడాలని పోలీసులు కోరుతున్నారు.

## వైకాపాలో 'వారసులకు ' నో ఛాన్స్.. తెదేపాలో సైతం ఛాన్స్ ..?

**ఉమ్మడి జిల్లాలో మరోమారు తెరపై రసవత్తర రాజకీయాలు..**
**అసెంబ్లీ స్థానాలు ఇరు పార్టీలకు కీలకమే !!**

కుప్పం, డిసెంబర్ 18 ప్రభాతవార్త

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు 'ఢీ' అంటే 'ఢీ' అనే స్థాయిలో ఎన్నికల యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుకు సొంత జిల్లా కావడం, మరో పక్క ఇదే ఉమ్మడి జిల్లా వాసి చంద్రబాబు నాయుడు రాజకీయ సమ ఉజ్జీ అయిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సైతం అధికార వైకాపాకు జోనల్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తూ జిల్లా వైకాపాకు పెద్దదిక్కుగా ఉన్నారు. వచ్చే 2024 ఎన్నికలు ఈ ఇద్దరికీ సవాల్‌గా మారాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా విభజన జరిగి ఇక్కడి నియోజకవర్గాలు ఇతర జిల్లాల్లో ఉన్నా అగ్ర నేతలకు ఉమ్మడి జిల్లా కీలకమైంది. ఈ సంగతి అలా ఉంచితే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న 'కుప్పం'పై గురి పెడితే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న 'పులివెందుల'పై దృష్టిసారించారని స్పష్టమవుతోంది. 2019 ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కుప్పం మినహా మిగతా సీట్లను అధికార వైకాపా కైవశం చేసుకుంది. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికలు అటు వైకాపా, తెదే పాలకు 'జీవన్మరణ'సమస్యగా మారిపోయాయి. ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకై ఇప్పటికే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కసరత్తులు మొదలు పెట్టారు. గతంలో జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన దివంగత బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, గాలి ముద్దుకృష్ణమనాయుడు కుటుంబాల నుంచి వారి వారసులైన బొజ్జల సుధీర్ రెడ్డి, గాలి భానుప్రకాష్‌నాయుడులకు సీట్ల కేటాయింపుపై పచ్చ జెండా ఊపినట్లు సమాచారం. మిగతా నియోజకవర్గాల్లో సైతం 'పాత కొత్తల' కలయికలతో అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలుస్తోంది. అయితే ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల మధ్య పొత్తులు కుదిరితే కొన్ని సీట్లు జిల్లాలో జనసేనకు కేటాయించే అవకాశాలు లేకపోలేదు. కాగా ప్రస్తుత అధికార పార్టీ తరపున తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలుగా ఉన్న భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూధన్‌రెడ్డిలు తమ వారసులను వచ్చే ఎన్నికల్లో బరిలో దించాలని శతవిధాలా ప్రయత్నాలు చేయగా అందుకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సానుకూలత చూపక మరలా వచ్చే ఎన్నికల్లో మీరే పోటీ చేయాలని సూచించినట్లు సమాచారం. దీంతో తిరుపతి నుంచి ఈసారి భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి నుంచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, శ్రీకాళహస్తి నుంచి బియ్యపు పవిత్రారెడ్డిలు బరిలో దిగడం కష్టంగానే మారినట్లు తెలుస్తోంది. అయితే చివరి నిమిషంలో ఏదైనా అద్భుతాలు జరుగుతాయోమో వేచి చూడాలి.

### సిట్టింగ్‌లకు సీట్లు ఖాయమేనా?

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం అధికార పార్టీ తరపున ఎమ్మెల్యేలుగా ఉన్న సిట్టింగ్‌లలో పలువురికి మరలా సీటు దక్కడం, దక్కకపోవడం అనేది సిఎం రాజకీయ సలహాదారు ప్రశాంత్ కిషోర్ బృందం ఐ ప్యాక్ అందించే నివేదికపై ఆధారపడి ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యేల పనితీరుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నివేదికలు తెప్పించుకుని సమీక్షలు జరుపుతున్న విషయం విదితమే. వైకాపా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో ప్రజలకు కలుగుతున్న లబ్ధిని ప్రజలకు నేరుగా వివరించాలని 'గడప గడపకు మీ ప్రభుత ్వం 'కార్యక్రమం నిర్వహించాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. ఈ కార్యక్రమం కొనసాగుతున్న తీరుపై సిఎం అంతర్గత నివేదికలు తెప్పించుకుని ఎమ్మెల్యేలకు తగు సలహాలు, సూచనలు ఇస్తున్నా రు. అయితే తాజాగా అసెంబ్లీ స్థానాలకు పరిశీలకులను నియమిం చడంతో పాటు ముున్ముందు నిర్వహించే సర్వేలను బట్టి అధికార పార్టీలో పలువురికి సీట్లు దక్కుతాయా లేదా అనేది స్పష్టం కానుం ది. ఎన్నికలకు ఏడాదిన్నర సమయం మాత్రమే ఉండడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలు మరోమారు తమ అదృష్టాన్ని పరీక్షించుకో వాలని ఎదురుచూస్తున్నారు.అధికార వైకాపా ఇతర పార్టీలతో పొత్తులు లేక ఒంటరిగానే పోటీ చేయనున్న నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలు రాష్ట్రంలో కీలకంగా మారబోతున్నాయి. 2024ఎన్నికలకు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి.

## జడ్పీ ఛైర్మన్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

- డ్రైవింగ్‌లో కారు డ్రైవర్‌కు అస్వస్థత



కుప్పం ఆసుపత్రి వద్ద పరిస్థితులను పర్యవేక్షిస్తున్న జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు, డిసెంబర్ 18 ప్రభాతవార్త: జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులుకు ఆదివారం ప్రమాదం తృటిలో తప్పింది. జడ్పీ ఛైర్మన్ ఆదివారం చిత్తూరు వచ్చి వి.కోటకు వాహనంలో తిరిగి వెళ్తుండగా పలమనేరు వద్ద వాహనం నడుపుతున్న మునిశేఖర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ పరిస్థితుల్లో వాహనం నిలుపుదల చేసిన జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు డ్రైవర్ మునిశేఖర్‌ను వాహనం వెనక సీటులో కూర్చొబెట్టుకొని వాహనం నడుపుకొంటూ కుప్పం ఆసుపత్రికి తీసుకెళ్ళారు. ఆపై డ్రైవర్ మునిశేఖర్‌ను ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స నిమిత్తం చేర్పించి అతనికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం జడ్పీ ఛైర్మన్ జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డికి విషయం తెలిపి డ్రైవర్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ మేరకు జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి కుప్పం ఆసుపత్రికి చేరుకొని డ్రైవర్‌కు ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేసి పరిస్థితులను పర్యవేక్షించారు. జడ్పీ ఛైర్మన్, సిఇఓలు డ్రైవర్ కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన కుప్పం ఆసుపత్రికి చేరుకొన్నారు.

## గుండిశెట్టిపల్లి చెరువులో ఘనంగా తెప్పోత్సవం



శాంతిపురం, డిసెంబర్ 18 ప్రభాతవార్త

మండలంలోని గుండిశెట్టిపల్లి గ్రామ సమీపంలో ఉన్న చెరువులో ఆదివారం గ్రామస్తులు ఘనంగా తెప్పోత్సవాన్ని నిర వ్వహించారు. పాతిక ఏళ్ల అనంతరం చెరువు పూర్తిగా నిండడంతో గ్రామస్తులు తెప్పోత్సవం జరిపారు. ఈసందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు తీసుకుని చెరువు వద్దకు చేరుకుని గంగమ్మకు సమర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున చెరువు వద్ద అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు సైతం అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## పోటెత్తిన కాణిపాకం ఆలయం



కాణిపాకం, డిసెంబర్ 18 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం ఆదివారం కూడా భక్తుల రద్దీతో పోటెత్తింది. గత కొద్ది నెలలుగా ఆలయంలో వారంతపు రోజుల్లో అంచనాలకు మించి భక్తుల రద్దీ వుంటోంది. ఈమేరకు ఆదివారం స్వామివారి దర్శనార్థం భక్తులు అనూహ్యంగా తరలివచ్చారు. ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప భక్తులు తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. ఆలయలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది.


పునాదులకే పరిమితమైన ప్రభుత్వ భవనాలు 4లో


### ఉష్ణోగ్రతలు

18/12/2022



- తిరుపతి 28 డిగ్రీలు
- చిత్తూరు 29 డిగ్రీలు
- మదనపల్లి 24 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 28 డిగ్రీలు
- వెంకటగిరి 29 డిగ్రీలు
- గూడూరు 29 డిగ్రీలు

### బంగారం ధరలు

18/12/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,056
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,516

### కోడిగ్రుడ్ల ధరలు


18/12/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00
1 డజను: రూ.72.00

## సరిహద్దులు దాటుతున్న బియ్యం

### మళ్ళీ విజృంభిస్తున్న మాఫియా




*సత్యవేడు, డిసెంబర్ 18, ప్రభాతవార్త: విజిలెన్స్ దాడులు..మూడుచోట్ల పోలీసుల మెరుపుదాడులు..బియ్యం స్వాధీనం..వాహనాలు సీజ్..అక్రమార్కులపై ఉక్కుపాదం..ఇది గతకొంతకాలంగా పేదోడికి ఇంటికి చేరాల్సిన ప్రభుత్వ సబ్సిడీ బియ్యం విషయంలో అధికారుల స్పందన..అయినా మళ్ళీ బియ్యం అక్రమ రవాణా మాఫియా విజృంభణ సత్యవేడులో మొదలైంది. తమిళనాడుకు సరిహద్దులో సత్యవేడు ఉండటం వల్ల ఇటు తమిళనాడు, ఆంధ్రా రాష్ట్రాల సబ్సిడీ బియ్యాన్ని కొనుగోలు చేసి శ్రీకాళహస్తి,పలమనేరు ప్రాంతాలకు తరలించి అక్కడ బియ్యాన్ని పాలిస్ చేసి ఏకంగా 25కేజీల బస్తాబియ్యం సుమారు 1300 రూపాయలు విక్రయిస్తున్నారు. సత్యవేడులో ఓ నలుగురు ఏకమై పోలీసులు, ఇతర అధికారులను వారు మచ్చిక చేసుకుని ఈ వ్యాపారం మూడు బస్తాలు..ఆరు రకాల ఆదాయ వనరులుగా మార్చుకుని లబ్ధిపొందుతున్నారు. సత్యవేడు కేంద్రంగా తమిళనాడు రాష్ట్రంలోని ఊత్తుకోట, గుమ్మిడిపూండి, మాదరపాకం,ఎగుమదురె,పాలవాకం, అచ్చిమనాయుడుకండ్రిగ, ఎన్ఎం కండ్రిగ ప్రాంతాలు నుంచి అక్కడ తమిళనాడు ప్రభుత్వం పేదలకు ఉచితంగా సరఫరా చేసే ఉప్పుడు బియ్యాన్ని కేజీ 5 నుంచి 10 రూపాయల చొప్పున ఇక్కడికి తీసుకుని వచ్చి నిల్వచేసుకుంటున్నారు.*

**పట్టించుకుంటే ఒట్టు..-అక్రమార్కుల కనికట్టు..**

*సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు మండలానుంచి మనరాష్ట్ర ప్రభుత్వ సబ్సీడీ బియ్యాన్ని సత్యవేడు కు చేరవేసుకుంటారు. ఇక్కడ ప్రభుత్వం ఇంటి పరిసరాలకే టెంపోల ద్వారా కొన్ని సంధర్భాల్లోనూ, డీలర్లు వద్ద కొన్ని సంధర్భాల్లో ఉచిత, కేజీ రూపాయి చొప్పున బియ్యాన్ని అందిస్తున్నారు. రెవిన్యూ అధికారులు పూర్తిగా ప్రజా పంపిణీ వ్యవస్థపై పర్యవేక్షణ మరిచిపోవడంతో ఈ అక్రమ రవాణా మాఫియాకు అడ్డుఅదుపులేకుండా పోతోంది. క్షేత్రస్థాయిలో ఏడాదికాలంగా ఏఒక్క తాశీల్దారు ఏవీధికి కానీ, గ్రామానికి గానీ వెళ్ళి బియ్యం అందిందా లేదా అని ప్రశ్నించిన దాఖలాలు లేవు.దాంతో ఏకంగా డీలర్లు నుంచి 4,5 రూపాయల చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసుకుంటున్నారు. తమిళనాడు, ఆంధ్రా రాష్ట్రాల నుంచి సేకరించిన బియ్యాన్ని సత్యవేడులోని జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న మంచినీటి ట్యాంక్ సమీపంలో కొందరి ఇళ్ళల్లో ఉంచి లారీ మొత్తంలో నిల్వ చేరిన వెంటనే శ్రీకాళహస్తి, పలమనేరు ప్రాంతాలకు తరలలించి భారీగా ఆదాయం పొందుతున్నారు. కొందరిపై వరుస కేసులు నమోదు అవుతున్నా ప్రయోజనం లేకపోతోంది. అటు కోర్టుకు వెళ్ళామా..బెయిల్‌పై వచ్చి వెంటనే మరో ఇంటికి గోడౌన్‌గా మార్చి తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. మొత్తంమీద పేదోడి సర్కార్ సబ్సిడీ బియ్యం అక్రమార్కులకు సిరులు కురిపిస్తున్నా అధికార యంత్రాంగం ప్రేక్షపాత్ర వహించడం ఆలోచించాల్సి ఉంది.*

## ప్రజా దీవెనలే జగనన్నకు శ్రీరామరక్ష

**మెగా శిబిరానికి విశేష స్పందన**





.మెగా వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తునన్న డాక్టర్లు, పర్యవేక్షిస్తున్న శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 18 ప్రభాతవార్త

ప్రజాదీవెనలే జగనన్నకు శ్రీరామరక్ష అని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధన రెడ్డి అన్నారు. ఆదివారం ఇక్కడి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న 50వ జన్మదిన సందర్బంగా వారోత్సవాల్లో భాగంగా మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా భువన విజయంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశానికి అంజూరు తారక శ్రీనివాసులు పర్యవేక్షించారు.ఈసందర్బంగా మాట్లాడుతూ 'దైవం మానుష రూపేణ' అన్నారు. రాముడు,షరిడి సాయిబాబా, పుట్టపర్తి సాయిబాబాలు మానవులే. వారు తమ సేవలతో దేవుళ్లు అయ్యారు. నేడు జగనన్న రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి నేరుగా సొమ్ములు జమచేస్తున్నారు. వారి కుటుంబాలను ఆదుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో కుటుంబాలను ఆదుకుంటున్నారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న జగనన్నను చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, కొన్నిమీడియాలు పని గట్టుకొని విమర్శిస్తుంటారు. 30 సంవత్సరాల పాలనలో ఏ నాయకుడు అయినా తన జేబులోంచి కానీ ప్రభుత్వం నుంచి జనం ఖాతాల్లోకి పైస విదిలించారా? అని ప్రశ్నించారు.

**మెగా సేవలు:**

శ్రీకాళహస్తిలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి జగనన్న జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన మెగా శిబిరానికి కార్పొరేట్ హాస్పిటల్స్ అయిన గ్లోబల్ హెల్ట్ సిటి(చెన్నై), నారాయణాద్రి ఆసుపత్రి, సంకల్ప ఆసుపత్రి, బాలాజి ఆసుపత్రి, వెంకటరమణ ఆసుపత్రి నుంచి 150 మంది డాక్టర్లు హాజరయ్యారు.వారికి ఎంఎల్ఏ తనయ బియ్యపు పవిత్రారెడ్డి సాధరంగా ఆహ్వానించారు.ఈ వైద్య శిబిరంలో 18,261 మంది ఓపి తీసుకున్నట్లు ఎంఎల్ఏ కార్యాలయం ప్రకటించారు. వైద్యపరీక్షలతో పాటు ఉచితంగా మందులు, భోజనాలను శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి పర్యవేక్షణలో అందించారు.ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు, మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు తనయుడు ఎస్‌సివి దిలీప్, నియోజకవర్గ పరిశీలకులు ఓడురు గిరిధర్‌రెడ్డి గుమ్మడి బాలకృష్ణయ్య, వయ్యాల కృష్ణారెడ్డి, పగడాల రాజు, చంద్రయ్యశెట్టి, నంద, మునిరెడ్డి, రామూగుప్తా, సిరాజ్, మున్నారాయల్, శంకర్,రవి,భరత్‌రెడ్డి, తిరుకాల మల్లికార్జున్ గౌడ్, వడ్లతాంగాళ్ బాలాజిరెడ్డి, ధశరధరామిరెడ్డి, మోహన్‌నాయుడు, చిట్టివేలు జయగోపాల్, సుబ్బారెడ్డి, భక్త, ఈశ్వర్‌రెడ్డి చింతామణి,పాండు, శ్రీవారి సురేష్, కంచి గురవయ్య, నాని, గోరా, కిరణ్,పసల కృష్ణయ్య, సుమతి, సునీత సింగ్,రుషేంద్రమణి, లక్ష్మీపతి, చింతా రాజేంద్ర, కొల్లూరు హరినా యుడు, సెన్నీరు కుప్పం శేఖర్, పిఎం చంద్ర, భాస్కర్,గోపి, శరవణ,పవన్ రాయల్, పులిరామచంద్రయ్య, ఫజలన, ఆర్‌డిఓ రామారావు, డివైయస్‌పి విశ్వనాధం, సిఐ పాల్గొన్నారు.

## శ్రీ చెంగాలమ్మ సన్నిధిలో రామ్‌కుమార్‌రెడ్డి



సూళ్లూరుపేట, డిసెంబర్ 18 ప్రభాతవార్త

సూళ్లూరుపేట శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవిని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన ఆయనకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డిలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రామ్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, తడ ఎంపీపీ కొళవి రఘు, వైసీపీ నాయకులు కళత్తూరు శేఖర్‌రెడ్డి, అయితా శ్రీధర్, చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, జెట్టి వేణుయాదవ్, మీజూరు రామకృష్ణారెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు వంకా దినేష్, ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెన్నేపల్లిలో ఫోర్టిఫైడ్ బియ్యం తయారీ యూనిట్ ఏర్పాటు

పెళ్లకూరు, డిసెంబర్ 18 ప్రభాతవార్త

పెళ్లకూరు మండలం పెన్నేపల్లిలో ఫోర్టిఫైడ్ బియ్యం తయారు చేసే యూనిట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఫెర్మెంటా బయోటెక్ సంస్థ ఏర్పాటు చేసిన ఈ ఫోర్టిఫైడ్ బియ్యం తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్లాంట్ ఇన్‌ఛార్జ్ సుధాకర్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రభుత్వం అనుమతితో పెన్నేపల్లిలో ఫెర్మెంటా బయోటెక్ సంస్థ సింగిల్‌లైన్ ఫెర్మెంటా బయోటెక్ మల్టినేషన్ పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ పరిశ్రమను 10 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు. ఈ పరిశ్రమలో రోజుకు ఆరు మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందన్నారు. ఇక్కడ తయారు చేసిన బియ్యం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సివిల్ సప్లయిస్ సంస్థకు తరలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటంరెడ్డి రామలింగారెడ్డి, ఓడూరు సనత్‌కుమార్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మురళీరెడ్డి, మురళీప్రసాద్‌నాయుడు, కుదిరి చక్రపాణి తదితరులు ఉన్నారు.

## ఘనంగా ధనుర్మాస భజనలు ప్రారంభం



కుప్పం, డిసెంబర్ 18 ప్రభాతవార్త

మండలంలోని పంచాయతీ కేంద్రమైన కంగుంది, వరమనూరు గ్రామాల్లో ధనుర్మాస భజనలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కంగుంది గ్రామంలో ధనుర్మాస భజనలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం 4గంటలనుంచే భక్త బృందం స్థానికంగా ఉన్న శ్రీ వేణుగోపాలసా ్వమి ఆలయం, ఆంజనేయాలయం, ఓంశక్తి, శ్రీ గంగమ్మ, నాగుల రాళ్ల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం గ్రామంలో భజనలు చేస్తూ ఆలయాలను సందర్శించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెడతారు. సంక్రాంతి వరకు ఈ ధనుర్మాస భజనలు నిర్వహిస్తారు. కార్యక్రమాల్లో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, భక్త బృందం మెగా హోం నీడ్స్ విసి మంజునాథ్, ప్రకాష్, శ్రీనివాసులు, నాగరాజు, దివాకర్, సర్పంచ్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన పద్మకళాక్షేత్ర డ్యాన్స్ ఈవెంట్

### -చిన్నారుల అద్భుత నృత్యాలు

తిరుపతి,డిసెంబర్ 18ప్రభాతవార్త:

సహజంగా చిన్నప్పటి నుంచే చదువుతోబాటు విద్యార్థినులకు పలురకాల క్రీడల్లో శిక్షణనిస్తారు. అయితే అందుకు భిన్నంగా పలువురు పేద విద్యార్థినులు తమ చదువుతోబాటు అదనపు సమయంలో నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తితో నృత్యం నేర్చుకున్నారు. ఇలా సుమారు 30మంది చిన్నారులు దాతల సహకారంతో చదువులోనేగాక ఇష్టమున్న రంగంలోనూ రాణించేలా పద్మకళాక్షేత్ర డ్యాన్స్ అకాడమీ నిర్వాహకురాలు కె. శ్రీదేవి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శిల్పారామంలో లాంఛనంగా వేసిన నృత్యపోటీలు అందరినీ అలరించాయి, తన సంపాదన, ఆశయం పేద పిల్లల సంక్షేమమే అని శ్రీదేవి తెలిపారు. అనాధ విద్యార్థినులను ప్రోత్సహించి వారిలోని కళను ప్రతిభను గుర్తించేలా కార్యక్రమం చేపట్టిన శ్రీదేవిని నవజీవన్ ట్రస్ట్ సేవా సమితి ట్రస్టీ శ్రీనివాసులు అభినందించారు. అనంతరం పలు రకాల నృత్యాల్లో అద్భుతంగా రాణించిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు.

## కేంద్రమంత్రి రేణుకసింగ్‌ను కలిసిన శంకర్‌నాయక్



తిరుమల,డిసెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:

కేంద్ర గిరిజన వ్యవహారాల సహాయమంత్రి రేణుకసింగ్ ఆదివారం ఉదయం కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అతిధిగృహంకు చేరుకున్న మంత్రిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ ,జిల్లా గిరిజన సంక్షేమ, సాధికార ఇన్‌ఛార్జి అధికారి చెన్నయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో గిరిజన అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై నాయక్ వివరించారు.

# పునాదులకే పరిమితమైన ప్రభుత్వ భవనాలు

**కృష్ణాజిమ్మాపురంలో నత్తనడకగా నిర్మాణాలు**



పునాదులకే పరిమితం అయిన కృష్ణాజిమ్మాపురం వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం



ఆవుల షెడ్డుగా మారిన కృష్ణాజిమ్మాపురం గ్రామ సచివాలయ భవనం.

పాలసముద్రం, డిసెంబర్ 18 ప్రభాతవార్త:

మండలంలోని కృష్ణాజిమ్మాపురం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భవన నిర్మాణాల నత్తనడక సాగుతున్నాయి. ఈ పంచాయతీ పరిధి నుండి మండల పరిషత్ అధ్యక్షుడు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ స్థానిక రాజకీయాలతో అభివృద్ధి పనులు ఏ మాత్రం చేపట్టకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ప్రజానీకం నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలసముద్రం మండల పరిధిలోని ఇతర గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు 80 శాతం మేరకు పూర్తయితే తెలుగుదేశం నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న కృష్ణాజిమ్మాపురం పంచాయతీలో మాత్రం ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పునాదుల స్థాయి దాటడం లేదంటే ఇక్కడ రాజకీయాలు ఎలా వున్నాయో అర్థమవుతుంది. ప్రతి 3 వేల ప్రజలకు ఒక సచివాలయంను మంజూరు చేసి సచివాలయాల్లో విధులు నిర్వర్తించడానికి 13 మంది సిబ్బందిని నియమించారు. కృష్ణాజిమ్మాపురం గ్రామ సచివాలయ పరిధిలో పాలనను క్షేత్ర స్థాయికి తీసుకెళ్ళడానికి ప్రభుత్వం సచివాలయం, వైఎస్ఆర్ రైతు భరోసా, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను మంజూరు చేసింది. ఈ పంచాయతీ నుండి ఎంపిపి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఆమె ఆధ్వర్యంలోనే ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు హడావుడిగా ప్రభుత్వ భవన నిర్మాణాలను ప్రారంభించిన ఈమె ఆపై నిర్మాణాలను పూర్తి చేయకుండానే వదలిపెట్టారు. కృష్ణాజిమ్మాపురం పంచాయతీలో క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ భవన నిర్మాణాలు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో ఒక కిలో మీటరు దూరంలో వున్న బలిజకండ్రిగలో ప్రస్తుతం గ్రామ సచివాలయంను సిబ్బంది నిర్వహించుకొనే పరిస్థితి నెలకొంది. వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు సైతం ఇదే తరహాలో మధ్యంతరంగా నిలిచిపోవడంతో ఇక్కడ విధులు నిర్వర్తించాల్సిన సిబ్బంది సైతం బలిజకండ్రిగలో విధులు నిర్వర్తించుకొంటే కాలక్షేపం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలోనే సమస్యలు పరిష్కరించబడుతాయని ఆశించిన కృష్ణాజిమ్మాపురం పంచాయతీ ప్రజలు సచివాలయ సిబ్బంది కోసం ఒక కిలోమీటరు దూరం నడచి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. సచివాలయం, వైఎస్ఆర్ రైతు భరోసా, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రస్తుతం ఈ నిర్మాణాలు జరుగుతున్న స్థలాలు పశువులు కొట్టంగా ప్రజలు ఉపయోగించుకొనే పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా అధికారులు స్పందించి కృష్ణాజిమ్మాపురం పంచాయతీ పరిధిలోని ప్రజలకు క్షేత్ర స్థాయిలో పరిపాలన అందించడానికి అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ భవనాలు నత్తనడకగా సాగుతుండటంతో జాతీయ మానవ హక్కుల భారత మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.గురుప్రసాద్ సంస్థ తరపున హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసి నిర్మాణాలు వేగవంతం చేయడానికి పూనుకొంటామని పేర్కొన్నారు.

## జాతీయ స్థాయికి ఎన్నికైన బాల్‌బ్యాడ్మింటన్ టీం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన 25 మంది క్రీడాకారులకు రెండు నెలల పాటు ఇక్కడ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారికి సహాయంగా బొల్లినేని జగన్నాథం నాయుడు అందించారు. జాతీయ స్థాయి నైపుణ్యాలతో శిక్షణను ప్రత్యేక కోచ్‌ల ద్వారా ఇప్పించారు.బాల బాలికలు చక్కగా శిక్షణ పొందారు. బాల్‌బ్యాడ్మింటన్ లో నైపుణ్యం కల్గిన న్యాయవాది వెంకటస్వామి మాట్లాడుతూ ఇక్కడ విద్యార్థులకు అన్ని విధాల శిక్షణ ఇచ్చామని వారు జాతీయ స్థాయిలో రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు సాధిస్తారని ఆశిస్తున్నామన్నారు.ఇక్కడ రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు రాష్ట్ర కమిటి ఎంపిక చేయటంతో తాము పోటీలు నిర్వహించి జాతీయ స్థాయి కమిటిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చామన్నారు. ఇక్కడ పోటీల నిర్వహణకు స్థానిక శాసనసభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డి సహకారం మరువరానిదన్నారు. ఇక ఎందరో దాతలు ముందుకు వచ్చి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఉత్సాహ పరచారని వెంకటస్వామి వివరించారు.ఇక్కడ ఎంపిక చేసిన కమిటి జాతీయ స్థాయిలో రాష్ట్ర పేరు ప్రతిష్టలు మిక్కిలి ఇనుమడింపజేస్తారని ఆశిస్తున్నామని వారికి శ్రీకాళహస్తీశ్వరుని ఆశీస్సులు ఉంటాయని వివరించారు.

## పొలాల వద్ద కొండ చిలువ ప్రత్యక్షం



కుప్పంరూరల్, డిసెంబర్ 18 ప్రభాతవార్త

మండలంలోని కంగుంది గ్రామ పొలాల వద్ద ఆదివారం ఓ భారీ కొండ చిలువ ప్రత్యక్షమైంది. ఇది గమనించిన స్థానికులు కొంత భయాందోళనలు చెందారు. అయితే లోకేష్ అనే యువకుడు స్థానికుల సాయంతో కొండచిలువను పట్టుకుని అటవీ అధికారులకు సమాచారం అందించడంతో వారు కొండ చిలువను అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

## గురువుల బదిలీలలో గందరగోళం

కోట, డిసెంబర్ 18 ప్రభాతవార్త



ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ గందరగోళంగా సాగుతోంది. ప్రమాణికమైన ఖాళీల జాబితాను విద్యాశాఖ ప్రకటించలేదు. దీనికి తోడు రేషనలైజేషన్‌తో రద్దయిన పోస్టుల వివరాలను వెల్లడించలేదు. మరోవైపు బదిలీలకు దరఖాస్తులు చేసుకునేందుకు ఆదివారం వరకు గడువు ఇచ్చినా బదిలీల వ్యవహారంలో చోటుచేసుకున్న పరిణామాలపై ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన, ఉత్కంఠ నెలకొంది. ఉపాధ్యాయుల సాధారణ బదిలీలకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం ఆ మేరకు పాఠశాల విద్యాశాఖను సన్నద్ధం చేయలేకపోయింది. జిల్లా స్థాయిలో సమాయత్తంగా ఉన్నది లేనిదీ గుర్తించకుండా షెడ్యూళ్లను ప్రకటించారు. జిల్లాలో బదిలీలకు అర్హులైన ఉపాధ్యాయులు ఎందరు ఉన్నారు? రేషనలైజేషన్‌తో రద్దయిన పోస్టులు ఎన్ని ? తదితర వివరాలు సమగ్రంగా సేకరించకుండానే ప్రక్రియ ప్రారంభమైంది. ఖాళీల వివరాలు ఈ నెల 12వ తేదీనే వెబసైట్‌లో పొందుపరుస్తామని ప్రకటించినా ఆచరణకు నోచుకోలేదు. ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఎస్‌జిబిలు, స్కూలు అసిస్టెంట్లు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తులు చేసుకోవాలన్న నిబంధన ఉంది. ఖాళీల వివరాలు ప్రకటించని తరుణంలో దరఖాస్తులు ఎలా చేసుకోవాలో అర్థం కావడం లేదని ఉపాధ్యాయులు వాపోయారు. కేటగిరి వారీగా వచ్చే పాయింట్లు ఆధారంగానే ఐచ్చికం ఇవ్వాలంటే ఖాళీల వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. దీనికితోడు రేషనలైజేషన్‌తో అనేక పాఠశాలల్లో పోస్టులు రద్దు చేశారు. ఈ ఖాళీల వివరాలు కూడా జాబితాలో పొందుపరచాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి కానందున ఆదివారం వరకు గడువు పొడిగించినట్లు భావించారు. మ్యాపింగ్‌లో పోస్టు కోల్పోయిన ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు వస్తాయి. అయితే ఆన్‌లైన్‌లో పాయింట్ల వివరాలు కనిపించలేదని అంటున్నారు. ఈ గందరగోళ పరిస్థితి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తోంది.

## జి-20 లోగోను ఎన్నికల గుర్తుగా మార్చేస్తున్న బిజెపి!

### -సిపిఐ జాతీయ కార్యదర్శి డా॥కె.నారాయణ డిమాండ్




తిరుపతి ప్రెస్‌క్లబ్,డిసెంబర్ 18 ప్రభాతవార్త:

జి-20 లోగోను తమ ఎన్నికల గుర్తుగా బిజెపి మార్చేస్తోందని,లోగోను కమలం గుర్తు ముందు వచ్చేలా రూపొందించడం సిగ్గుచేటని సిపిఐ జాతీయ కార్యదర్శి డా॥కె.నారాయణ అన్నారు. బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జి-20 అనేది 420ల చేతిలో పడటం బాధాకరమన్నారు.పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అబద్ధాలు చెప్పారని,మాఫియా గ్యాంగ్‌కు సాక్షాత్తూ కేంద్ర ఆర్థిక మంత్రి వత్తాసు పలుకుతున్నారని,కావున ఆమె తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.సామాన్యులు,రైతులకు రుణమాఫీ చేయకుండా కార్పొరేట్ కంపెనీలకు 10 లక్షల కోట్లు రద్దు చేసిందని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.బ్యాంకులకు కట్టాల్సిన రుణాలను ఎగ్గొట్టిన మాఫియాకు కేంద్ర ఆర్థిక మంత్రి ఊడిగం చేస్తున్నారని ధ్వజమెత్తారు.ప్రధాన మంత్రి,హోం మంత్రి గుజరాత్‌లో గల్లీ గల్లీ తిరిగి ప్రతిపక్షాల ఓట్లు చీల్చి గెలిచారు తప్ప ఇందులో వారి గొప్పదనం ఏమీలేదని తేల్చేశారు.బిజెపికి వ్యతిరేకంగా వ్యవహరించిన రాజకీయ పార్టీలు,వ్యవస్థలను ఈడి,సిబిఐలను ఉసిగొల్పి కక్షపూరిత దాడులు చేయించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఛీత్కరించారు.వీర్లపాడులో అన్ని కార్యాలయాలను మండల కేంద్రం నుండి తరలించి తమకు అనుకూలమైన గ్రామాల్లో పెట్టడం వైసిపి ప్రభుత్వానికి తగదన్నారు.నగరి నియోజకవర్గం అయినంబాకం గ్రామంలో అర్ధరాత్రి రెవిన్యూ,పోలీసు అధికారుల సాయంతో రౌడీ మూకలు ఖాళీ స్థలాలను శుభ్రం చేసి కాజేయాలని చూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు,మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి,జిల్లా కార్యదర్శి నదియా,సిపిఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు వేదికగా మారిన రేణిగుంట



రేణిగుంట, డిసెంబరు 18 ప్రభాతవార్త:

రేణిగుంట బాలికల(జూనియర్ కళాశాల) ఉన్నత పాఠశాలలో ఆదివారం 66వ రాష్ట్ర స్థాయి అండర్ 14,17 బాల బాలికల స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ చిత్తూరు ఆధ్వర్యంలో రెజ్లింగ్ పోటీలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం నుంచి మంగళవారం వరకు పోటీలు జరుగుతాయి. ముఖ్య అతిథిగా వచ్చిన తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డా. వి.శేఖర్ పోటీలను ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ మాట్లాడుతూ రెజ్లింగ్ పోటీలను రేణిగుంటలో జరగడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే ఆరోగ్యంతఓ పాటు మానసిక ఉల్లాసం వల్ల ఒత్తిడిని అధిక మించవచ్చని తెలిపారు. క్రీడా సర్టిఫికెట్స్ వలన క్రీడల కోటాలో ఉద్యోగాల్లో రిజర్వేషన్స్ పొందే అవకాశాన్ని వదులుకోవద్దని కోరారు. విద్యా సంస్థ ప్రధాన ఆచార్యులు విష్ణువర్ధని ఆయన అభినందించారు. తిరుపతి స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి దాదాపు 600 మంది క్రీడాకారులు, మేనేజర్లు, కోచ్‌లు పాల్గొంటున్నారని వారందరికి మూడురోజుల వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రధాన ఆచార్యులు విష్ణువర్ధని మాట్లాడుతూ రాష్ట్రపాఠశాల క్రీడా సమాఖ్య పోటీలను బాలికల పాఠశాలకు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో జిల్లా క్రీడా కార్యదర్శి సురేష్‌బాబు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తిరాజు, జిల్లా సీఎంవో సురేష్, గేమ్స్ అబ్జర్వర్ రమేష్, తిరుపతి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యంరెడ్డి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు మధన్ మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పూలరంగడుపల్లిలో క్షుద్ర పూజలు



వెంకటగిరి, డిసెంబరు 18, ప్రభాతవార్త:

మండలంలోని పూలరంగడుపల్లి పద్మమ్మ, మస్తానమ్మ ఇళ్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పద్మమ్మ ఇంటి ముందు పూలు, పసుపు, కుంకుమ చల్లి ఉండడాన్ని గుర్తించారు. గుర్తు తెలియని పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని తమను చంపేందుకు కొందరు ప్రయత్నాలు చేశారని పద్మ వాపోయారు. మా దుస్తులను కూడా కాల్చివేశారని తెలిపారు. ఇళ్ల ముందు పసుపు కుంకుమలతో బొమ్మలు వేశారని, పూలు చల్లారని తెలిపారు. పోలీసులు గ్రామానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అందరి సహకారంతోనే అద్భుతంగా ఆలయ పునర్నిర్మాణం

కాణిపాకం, డిసెంబర్ 18 ప్రభాతవార్త:

అందరి సహకారంతోనే సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ప్రధాన ఆలయ పునర్నిర్మాణ పనులు శిల్పకళ ఉట్టిపడే విధంగా దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగిందని ఆలయ పునర్నిర్మాణ దాతల సమన్వయకర్త గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. సుమారు వెయ్యేళ్ళకు ముందు నిర్మించిన ఆలయం పెరుగుతున్న భక్తుల రద్దీతో ఇరుకుగా తయారవడంతో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ప్రవాస భారతీయులైన విజయవాడకు చెందిన ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్ అనే దాతలు 9.06 కోట్లు రూపాయల వ్యయంతో అద్భుత శిల్పకళ ఉట్టిపడే విధంగా పునర్నిర్మించి ఆగస్టు 21 కుంభాభిషేకం నిర్వహించిన విషయం విధితమే. ఇందుకు సంభందించి రెండు దఫాలుగా 8.30 కోట్లు రూపాయలను దేవస్థానంకు అందించగా మిగిలిన 76 లక్షల రూపాయలను రామకృష్ణ ప్రసాద్ ఆదివారం డీడీ రూపంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులకు అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి 9.06 కోట్లు రూపాయలు ఖర్చయినట్లు తెలిపారు. ఈమొతాన్ని దాతలు ప్రవాస భారతీయులైన ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్‌లు అందించడం జరిగిందని తెలిపారు. అలయాన్ని పూర్తిగా అద్భుతంగా నిర్మించడానికి తమకు అవకాశం కల్పించిన ఆలయ ఉభయదారులు, ఛైర్మన్, ఈఓ, గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నూతన ఆలయంలో ఏసీలు అమర్చడానికి 21.31 లక్షల రూపాయలను అందించినట్లు రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శిల్పకళ ఉట్టిపడేవిధంగా ఆలయ పునర్నిర్మించిన దాతలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, సమన్వయకర్త రామకృష్ణప్రసాద్‌లకు దేవస్థానం తరపున కృతజ్ఞతలు తెలుపుతూ ఆలయంలో గర్భాలయ ద్వారానికి బంగారు తొడుగులు, మరో రెండు ద్వారాలకు వెండి తొడుగులు నిర్మాణానికి ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. ఎంతో ఇరుకుగా వున్న కాణిపాకం ఆలయాన్ని దాతలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, సమన్వయకర్త రామకృష్ణప్రసాద్‌లు అద్భుత శిల్పకళతో పునర్నిర్మాణం పూర్తి చేసి దేశంలోనే ప్రముఖ ఆలయాల్లో కాణిపాకం ఆలయ ఒకటిగా

**ఆలయ పునర్నిర్మాణ దాతల సమన్వయకర్త**



కాణిపాకం ఆలయానికి 1.08 కోట్లు రూపాయల చెక్‌ను అందిస్తున్న రామకృష్ణప్రసాద్

తీర్చదిద్దినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. ఇందుకు సహకరించిన దేవాదాయశాఖ అధికారులు, పాలక మండలి, ఉభయదారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా వుండగా ఆలయ పునర్నిర్మాణంకు అయిన ఖర్చు మొత్తంలో మిగిలిన మొత్తం 76 లక్షల రూపాయలను, నూతన ఆలయంలో ఏసీల ఏర్పాటుకు అయ్యే 21.31 లక్షల రూపాయలను దాతలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్‌ల తరపున వారి సమన్వయకర్త రామకృష్ణప్రసాద్ ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులకు అందజేశారు. ఈసందర్భంగా రామకృష్ణ ప్రసాద్‌కు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు., ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.